క్లుప్తంగా

వారసంత వేలం

నేరడిగొండ: నేరడిగొండ వారసంత వేలం పాటను సోమవారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించారు. వేలం పాటలో పలువురు పాల్గొన్నారు. పట్టెపు ప్రకాష్ రూ.4 లక్షల 57వేలకు వేలం దక్కించుకున్నట్లు పంచాయతీ కార్యదర్శి రాఘవేంద్ర తెలిపారు.

సహకార సేవలు సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న వైస్ చైర్మన్ ధనుంజయ్

తాంసి: ప్రాథమిక సహకార సంఘం ద్వారా రైతులకు అందిస్తున్న సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తాంసి సహకార సంఘం వైస్ చైర్మన్ ధనుంజయ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని సహకార సంఘం కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సహకార సంఘంకు పంటల కొనుగోళ్లు, ఎరువుల విక్రయం ద్వారా వచ్చిన కమీషన్‌తో పాటు ఖర్చులను సీఈవో సభ్యులకు చదివి వినిపించారు. రైతులకు వ్యవసాయ రుణాలతో పాటు వ్యవసాయేతర రుణా లను అందిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో సీఈవో కేశవ్, డైరెక్టర్‌లు అశోక్ రెడ్డి, బుజ్జన్న, చంద్రన్న, లలిత,భూమారెడ్డి, కార్యదర్శులు గణేష్, సుధాకర్, సిద్దార్థ్ రెడ్డి పాల్గొన్నారు.

స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దాలి



శిక్షణ తరగతులు నిర్వహిస్తున్న అధికారులు

ఇంద్రవెల్లి: గ్రామాలను స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దాలని ఎంపీపీ పోటే శోభాబాయి, జెడ్పీటీసీ ఆర్క పుష్పలతలు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని రైతువేదికలో ప్రభుత్వాఖల అధికారులకు రెండో విడత స్వచ్ఛభారత్‌పై శిక్షణ తరగతులు ప్రారంభించారు. ఈశిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీవో సంతోశ్, స్వచ్ఛ భారత్ జిల్లా కోఆర్డినేటర్లు జాదవ్ సంపత్, రాథోడ్ సందీప్ పాల్గొన్నారు.

రంజాన్ సరుకులు పంపిణీ

ఆదిలాబాద్‌అర్బన్: పట్టణంలోని నేతాజీ చౌక్‌లో జమాతే ఇస్లామీ హింద్ కార్యాలయంలో పేదలకు రంజాన్ సరుకులు పంపిణీ చేశారు. జిల్లా అధ్యక్షుడు తన్వీర్ అహ్మద్ మాట్లాడుతూ.. పేదల అవసరాలను తీర్చేలా బడియల్ రిలీఫ్ ట్రస్ట్ న్యూఢిల్లీ సహకారంతో సేవ కార్యక్రమాలు కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో పట్టణాధ్యక్షుడు అబ్దుల్ జలీల్, అర్షద్, యకూబ్ అహ్మద్, ఇంతియాజ్, నసీర్, నదీం పాల్గొన్నారు.

ఎమ్మెల్సీకి ఆహ్వానం



ఆహ్వాన పత్రిక అందజేస్తున్న సభ్యులు

ఉట్నూర్‌రూరల్: సిరికొండ మండలంలోని వాయిపేట్ గ్రామంలో ఉన్న మహంకాళి దేవాలయ బ్రహ్మోత్సవాలు ఏప్రిల్ 6 నుంచి ప్రారంభం అవుతాయని, బ్రహ్మోత్సవాలు హాజరు కావాలని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్‌ను ఆలయ కమిటీ అడ్వైజర్ కోట్నాక్ ఉమేశ్ కోరారు. ఈమేరకు ఆహ్వాన పత్రిక అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ జైవంత్‌రావు, వైస్ ఎంపీపీ బాలాజీ, బీఆర్‌ఎస్‌వీ జిల్లా అధ్యక్షుడు ధరణి రాజేశ్, తన్నీరు సతీశ్ పాల్గొన్నారు.

యోగాపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ప్రకాశ్‌రెడ్డి

ఎదులాపురం: స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాలలో సోమవారం ఆర్ట్‌ఆఫ్ లివింగ్‌లో భాగంగా నిపుణులు ప్రకాష్‌రెడ్డి యోగాపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ప్రిన్సిపాల్ జలగం అనిత అధ్యక్షత వహించారు. మనసుపై నియంత్రణ, శ్రద్ధ, ఆసక్తి, జ్ఞాపకశక్తి పెంపొందించుటకు యోగా, ధ్యానం ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ప్రభాత్‌రావు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

బడి.. ప్రకృతి ఒడి

- హరితవనంలా కప్పర్ల పాఠశాల
- ఆకట్టుకుంటున్న పచ్చదనం
- ప్రశాంత వాతావరణంలో తరగతుల నిర్వహణ



మొక్కలకు నీరు పడుతున్న హెచ్‌ఎం కిష్టన్న



స్వాగత తోరణంలా పచ్చని చెట్లు

తాంసి: మండలంలోని కప్పర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హరితవనాన్ని తలపిస్తోంది. పాఠశాల ఆవరణలో మొక్కల పెంపకాన్ని విరివిగా చేపట్టడంతో పచ్చదనం ఆకట్టుకుంటోంది. హరితహారంలో భాగంగా నాటిన మొక్కలను సంరక్షించడంతో ప్రస్తుతం ఏపుగా పెరిగి వృక్షాలుగా మారాయి. వేసవిలో కూడా పాఠశాల ఆవరణ పచ్చగా, ఆహ్లాదకరంగా కనిస్తోంది. ప్రధాన గేట్‌కు ఇరువైపులా పచ్చదనం పరుచుకుంది.

ఏడేళ్లుగా మొక్కల పెంపకం..

2015 సంవత్సరంలో మొక్కల పెంచేందుకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కిష్టన్న, ఉపాధ్యాయులు శ్రీకారం చుట్టారు. హరితహారంలో భాగంగా పాఠశాల ఆవరణలో 100 మొక్కలను విద్యార్థులతో నాటించారు. పూలమొక్కలు, అలంకరణ మొక్కలు నాటారు. విద్యార్థులకు ఒక్కొక్కరికి ఒక మొక్క సంరక్షణ బాధ్యత అప్పగించారు. క్రమం తప్పకుండా నీటిని అందించి సంరక్షించారు. వేసవిలో మొక్కలకు నీరు పోసేందుకు ప్రధానోపాధ్యాయుడు తన సొంత డబ్బులతో ప్రత్యేకంగా ఒక వ్యక్తిని నియమించాడు. దీంతో మొక్కలు ఏపుగా పెరిగి ఆహ్లాదనాన్ని పంచుతున్నాయి.

పెరిగిన విద్యార్థుల సంఖ్య..

పచ్చదనంతో పాటు మెరుగైన విద్య బోధన అందించడంతో పాఠశాల విద్యార్థుల సంఖ్య ప్రతి ఏటా పెరుగుతోంది. గ్రామస్తులు పాఠశాల అభివృద్ధికి సహకరిస్తూ స్వచ్ఛందంగా విరాళాలు అందిస్తున్నారు. దీంతో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నారు. ఆన్‌లైన్ తరగతుల కోసం రూ.60 వేల టీవీ, రూ.1 లక్షతో వేదిక నిర్మాణం చేపట్టారు. చదువులో ఉన్నతంగా రాణిస్తున్న విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందిస్తూ.. తమవంతుగా ప్రోత్సాహిస్తున్నారు. ప్రస్తుతం పాఠశాలలో 320 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు.

ఆహ్లాదకరమైన వాతావరణం

పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా బాధ్యతలు తీసుకున్నప్పటి నుంచి మొక్కలను పెంచుతున్నాను. విద్యార్థులకు మొక్కల ప్రాముఖ్యత, పెంచడం వలన కలిగే ప్రయోజనాలు వివరిస్తున్నాం. ప్రస్తుతం పాఠశాలలో పెంచిన మొక్కలు ఏపుగా పెరిగాయి. పాఠశాల ఆవరణలో ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొంటుంది.

– కిష్టన్న, ప్రధానోపాధ్యాయుడు, కప్పర్ల

అటెన్షన్ ప్లీజ్.. వేగ నియంత్రణలు కరువు



గుడిహత్నూర్: మండల కేంద్రంలోని జాతీయ రహదారి 44పై కేవలం 40కి.మీ. వేగంతో ప్రయాణించాలని బోర్డు సూచించినప్పటికీ భారీ వాహనాల డ్రైవర్లు నిబంధనలు పాటించడం లేదు. దీంతో స్థానిక బస్టాండ్ సర్కిల్ వద్ద ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు స్పందించి వేగ నియంత్రణ బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

–సంబంధిత అధికారి: పవన్, ఎస్‌హెచ్ అధికారి, ఫోన్: 97048 95999

బీజేపీ, కాంగ్రెస్‌ను నమ్మి మోసపోవద్దు

- బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు



మాట్లాడుతున్న బోథ్ ఎమ్మెల్యే బాపురావు

తలమడుగు: బీజేపీ, కాంగ్రెస్ నాయకులను నమ్మి మోసపోవద్దని బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు అన్నారు. సోమవారం మండలంలోని ఉమ్రి గ్రామంలో బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో మాత్రమే వచ్చే నాయకులకు తగిన బుద్ధి చెప్పాలన్నారు. పార్టీలో ఉండి వెన్నుపోటు పొడిచే నాయకుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. అలాంటి నాయకులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. రానున్న ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. గ్రామాల్లో జరిగిన అభివృద్ధిపై చర్చించి ఓటు వేయాలన్నారు. ఉమ్రీ నుంచి మహారాష్ట్రకు రహదారి మంజూరు కావడం జరిగిందన్నారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మండల రైతుబంధు సమితి అధ్యక్షుడు గోకజీవన్ రెడ్డి, బోథ్ నియోజకవర్గ అధికార ప్రతినిధి మొట్టె కిరణ్ కుమార్, కన్వీనర్ వెంకటేశ్, శ్రీనివాస్‌రెడ్డి, వనమాల, మాధవరావు, గంగాధర్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ బలోపేతానికి కృషి చేద్దాం

- ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రేఖానాయక్

ఇంద్రవెల్లి: బీఆర్‌ఎస్ బలోపేతానికి కృషి చేయాల్సిన అవసరం ఉందని ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్ అన్నారు. సోమవారం మండలంలోని కేస్లాపూర్ నాగోబా దర్బర్‌హాల్‌లో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనానికి హాజరయ్యారు., ముందుగు నాగోబా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మండల అధ్యక్షుడు మారుతి డోంగ్రె అధ్యక్షతన నిర్వహించిన సమ్మేళనంలో పార్టీ బలోపేతం, పేదలకు అందుతున్న సంక్షేమ పథకాలు, ప్రజా సమస్యలపై అభిప్రాయాలు సేకరించారు. రాష్ట్రంలో రెండుసార్లు అధికారం చేపట్టి, తెలంగాణను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకు వెళ్తున్నామన్నారు. కోట్లాది రూపాయల నిధులు వెచ్చించి ఖానాపూర్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పోటే శోభాబాయి, ఏఎంసీ చైర్మన్ జాదవ్ శ్రీరాం నాయక్, పీఏసీఎస్ చైర్మన్ మారుతి డోంగ్రె, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు మహ్మద్ అంజద్, సర్పంచ్‌లు కోరెంగా గాంధారి, జాదవ్ లక్ష్మన్, రాథోడ్ రాంచందర్, మడావి బాపురావ్, తదితరులు పాల్గొన్నారు.

ముంపు గ్రామంపై చిన్నచూపు



శిథిలావస్థకు చేరిన ఇల్లు

- పరిహారం కోసం దేగామ గ్రామస్తుల ఎదురుచూపు
- శిథిలావస్థలో వందల ఇళ్లు
- పట్టించుకోని అధికారులు

బజార్‌హత్నూర్: మండలంలోని బజార్‌హత్నూర్ సమీపంలో 2002 సంవత్సరంలో రూ.14.15 కోట్లతో 4700 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో నిర్మించిన ప్రాజెక్టు బ్యాక్‌వాటర్‌తో దేగామ గ్రామం ముంపునకు గురైంది. వర్షాకాలంలో వరద పోటెత్తడంతో వరదనీరు ఇళ్లలోకి చేరి ఇళ్లు నేల మట్టమయ్యాయి. పాములు, తేళ్లు రావడంతో గ్రామస్తులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని బతుకుతున్నారు. గ్రామంలో 479 గృహాలు ఉంటే ముంపు బాధితుల పునరావాసం కింద మొదటి విడతలో 77 ఇళ్లను దేగామ ఎగువ ప్రాంతంలోని సర్పంచ్‌గూడ సమీపంలో నిర్మించి ఇచ్చారు. 2005లో రెండో విడతలో 74 ఇళ్లు నిర్మించారు. మిగత గ్రామాన్ని ఎగువ ప్రాంతానికి తరలించాల్సి ఉన్నా.. అధికారులు పట్టించుకోవడం లేదు. 12 సంవత్సరాల నుంచి అధికారుల చుట్టూ తిరిగినా.. ఫలితం ఉండడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అప్పటి కలెక్టర్ దివ్యదేవరాజన్ గ్రామంలో సర్వే చేయించారు. ముంపు ప్రాంతానికి వంద మీటర్ల దూరంలోని 130 ఇళ్ల తొలగించి ఎగువ ప్రాంతంలో నిర్మించి ఇవ్వాలని అధికారులు రిపోర్ట్ చేశారు. దీంతో 2018 జనవరి 3న దేగామ పర్యటించి 130 ఇళ్లకు స్థలాలు కేటాయించారు. అయితే మిగతా 198 ఇళ్ల పరిస్థితి ఏమిటని బాధితులు వాపోతున్నారు.

పాములు వస్తున్నాయి

వర్షాకాలం ఇళ్లలోకి పాములు, తేళ్లు వస్తున్నాయి. గ్రామం చుట్టూ ప్రాజెక్టు నీళ్లు ఉండడంతో చిన్న పిల్లలు ఆడుకుంటు వెళ్లి అందులో పడుతున్నారు. గత పదేళ్లలో 10 మంది నీట మునిగి చనిపోయారు. ప్రభుత్వం స్పందించి గ్రామం మొత్తాన్ని తొలగించాలి.

– మర్రి కళావతి దేగామ

భయం భయంగా బతుకుతున్నాం

వర్షాకాలం వచ్చిందంటే భయం భయంగా బతుకుతున్నాం. ఏ ప్రమాదం ముంచుకోస్తుందోనని నిద్రలులేని రాత్రులు గడుపుతున్నాం. ఇక్కడ ఉండలేక పోతున్నాం. ఎగువ ప్రాంతంలో డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించి ఇవ్వాలి.

– మడ్డే రమేశ్, దేగామ

అవగాహన సదస్సు

ఎదులాపురం: జిల్లా కేంద్రంలోని గెజిటెడ్ నం.1 పాఠశాలలో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు మానసిక సంసిద్ధత, కేరీర్ గైడెన్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. రిమ్స్ కళాశాల మానసిక వైద్యులు (సైక్రియాటిస్ట్) ఓం ప్రకాశ్ హాజరై అవగాహన కల్పించారు. విద్యార్థులు ఒత్తిడి గురి కావద్దని స్వేచ్ఛాయుత వాతావరణంలో పరీక్షలు రాయాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు నీలాదేవి, తపస్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సునీల్ చవాన్, వలభోజు గోపికృష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు గోపాలకృష్ణ, ఉపాధ్యాయులు, ప్రశాంత్ పాటిల్ పాల్గొన్నారు.

విజయవంతం చేయండి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

నేరడిగొండ: భద్రాది కొత్తగూడెంలో ఏప్రిల్ 6, 7, 8 తేదీల్లో నిర్వహించే ఆదివాసీ అస్తిత్వ సభలను విజయవంతం చేయాలని న్యాయవాది పంద్రం శంకర్ కోరారు. మండలంలోని లఖంపూర్‌లో సోమవారం సభకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను సర్మేడి ఆత్రం సోనేరావుతో కలిసి ఆవిష్కరించారు. ఆదివాసీలు అధిక సంఖ్యలో తరలిరావాలన్నారు. కార్యక్రమంలో గ్రామ పటేల్ ఆత్రం సుంగు, పీచర సర్పంచ్ మెస్రం సీతారాం, ఆత్రం లక్ష్మణ్, కారోబారి మెస్రం భీంరావ్, పంద్రం సోనేరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పక్షోత్సవాలు

ఆదిలాబాద్‌అర్బన్: అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ పక్షోత్సవాలు కొనసాగుతున్నాయి. సోమవారం భుక్తాపూర్ అంగన్‌వాడీ కేంద్రం –7లో చిరు ధాన్యాలపై అవగాహన కల్పించారు. పండ్లు, కూరగాయలు తినాలని అంగన్‌వాడీ టీచర్లు ఎ.కవిత, టి.జ్యోతి, ఎస్.కళావతి, గోదావరిలు గర్భిణులకు సూచించారు. కార్యక్రమంలో పిల్లల తల్లిదండ్రులు ఫరియల్ భాను, సౌమ్య, లావణ్య, సుమయ్య, శ్రీజ పాల్గొన్నారు. ఆదిలాబాద్ పట్టణంలోని సుందరయ్యనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం చిన్నారులతో తోరణాలు కట్టించారు. ఆకులు కుడితే పిల్లల కంటికి, చేతికి ఏకాగ్రత వస్తుందన్నారు. కండరాలు అభివృద్ధి చెందుతాయని అంగన్‌వాడీ టీచర్ రాధ తెలిపారు.

వైభవంగా పంచమి వేడుకలు



పంచమి వేడుకల్లో పాల్గొన్న భక్తులు



పల్లకి ఊరేగింపులో ఎమ్మెల్యే జోగు రామన్న

బేల: మండలంలోని కాప్సి(బి) గ్రామంలో ఉగాది పండుగ నుంచి కొనసాగుతున్న ఆధ్యాత్మిక గురువు నానాజీ మహరాజ్ పంచమి వేడుకలు సోమవారం ముగిశాయి. ఈసందర్భంగా ప్రధాన వీధులగుండా భజన, కీర్తనల మధ్య పల్లకిని ఊరేగించారు. స్థానిక హనుమాన్ ఆలయ ఆవరణలో ఆధ్యాత్మిక గురువు నానాజీ మహరాజ్ శిష్య బృందం భక్తులకు ప్రవచనాలు బోధించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రావుత్ మనోహర్, జక్కుల మధుకర్, భక్తులు పాల్గొన్నారు.

సమాచారం

రేపు పశువుల సంతకు వేలం

ఇచ్చోడ: ఇచ్చోడ పశువుల, మేకల, వారసంత, దిన సంతలతో పాటు పంచాయతీ అద్దె గదులకు ఈనెల 29న వేలం నిర్వహించనున్నట్లు పంచాయతీ ఈవో సూర్యప్రకాశ్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. పశువుల, మేకల, వార, దినసంత వేలం పాటలలో పాల్గొనే వారు రూ. లక్ష రూపాయల ధరావత్తును డీడీ రూపంలో చెల్లించాలన్నారు. మధ్యాహ్నం 3 గంటలలోపు డీడీలను పంచాయతీ కార్యాలయంలో సమర్పించాలన్నారు.

వారసంతకు..

బోథ్: బోథ్ వారసంత వేలం బుధవారం నిర్వహించనున్నట్లు బోథ్ పంచాయతీ కార్యదర్శి అంజయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు వేలం ప్రారంభమవుతుందన్నారు. వేలంలో పాల్గొనే వారు రూ.40 వేల ధరావత్తు చెల్లించాలన్నారు.

నేడు తైబజార్ వేలం

బేల: మండలంలోని సాంగిడి గ్రామంలో ప్రతీ మంగళవారం నిర్వహించే తైబజార్‌కు 2023–24 సంవత్సరానికి వేలం పాట నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి గౌతమ్ ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనే వారు ముందుగా రూ.15 వేలు డిపాజిట్ చేయాల్సి ఉంటుందన్నారు.

నేడు బ్యాంక్ ప్రారంభం

ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రంలో మంగళవారం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ప్రారంభించడం జరుగుతుందని బ్యాంక్ మేనేజర్ ప్రవీన్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిర్మల్ జిల్లా కలెక్టర్ వరుణ్ రెడ్డి, ఉట్నూర్ ఆర్డీవో కదం సురేశ్, ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్‌లు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు.

నేడు పాఠశాల వార్షికోత్సవం

నేరడిగొండ: మండల కేంద్రంలోని శ్రీసరస్వతి శిశు మందిర్ ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవాన్ని మంగళవారం నిర్వహించనున్నట్లు ప్రధానచార్యులు మీనా ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 6 గంటలకు పాఠశాలలో ఈ కార్యక్రమం ఉంటుందన్నారు.

రేపు సరస్వతి శిశుమందిర్..

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని ఓల్డ్ హౌజింగ్‌బోర్డులో గల శ్రీ సరస్వతి శిశుమందిర్ ఉన్నత పాఠశాల 55వ వార్షికోత్సవాన్ని బుధవారం నిర్వహించనున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు వేణుగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా జడ్జి సునీత, డీఎల్‌ఎస్‌ఏ కార్యదర్శి క్షమాదేశ్‌పాండే, డీఈవో ప్రణీత పాల్గొంటారని పేర్కొన్నారు.

నేడు బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనం

తాంసి: మండలంలోని అంబుగాం గ్రామంలో బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనాన్ని మంగళవారం నిర్వహించనున్నట్లు బీఆర్‌ఎస్ మండల కన్వీనర్ అరుణ్ కుమార్ తెలిపారు. ఉదయం 11 గంటలకు నిర్వహించే ఆత్మీయ సమ్మేళనానికి ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు.

రసాబాసగా ప్రజావేదిక



కూలీలతో మాట్లాడుతున్న అధికారులు

ఖానాపూర్: పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో సోమవారం జరిగిన ఉపాధిహామీ ప్రజావేదిక రసాబాసగా సాగింది. డీఆర్డీవో విజయలక్ష్మితోపాటు ఎస్‌ఎంటీ దత్తు, హెచ్‌ఆర్ మేనేజర్ సుధాకర్ హాజరయ్యారు. మండలంలోని 24 గ్రామ పంచాయతీల్లో 2019 నుంచి మార్చి 2022 వరకు రూ.17.75 కోట్లతో ఉపాధి పనులు జరిగినట్లు అధికారులు తెలిపారు. పలు గ్రామాల్లో చనిపోయిన వారు, దుబాయ్ వెళ్లిన వారి పేర్లపై, ప్రభుత్వ సంస్థల్లో పని చేసే అంగన్‌వాడీ హెల్పర్, పంచాయతీ వర్కర్లు, ఆశావర్కర్ల పేర్లపై కూలి డబ్బులు చెల్లించినట్లు బీఆర్‌పీలు ప్రజావేదికలో వెల్లడించారు. పనుల్లో వెలుగు చూసిన అవినీతి, అక్రమాల నిలదీతల మధ్య ప్రజావేదిక సాగింది. ఎస్సై శంకర్ అక్కడికి చేరుకొని సముదాయించడంతో ఆందోళన సద్దుమణిగింది. మండలంలోని బీర్నంది, కోలంగూడ, ఎర్వచింతల్, ఎక్బాల్‌పూర్, కోలంగూడ, కొత్తపేట, బావాపూర్(ఆర్), రాజు, దాసునాయక్‌తండా, బిలన్యానాయక్‌తండా, సుర్జాపూర్, బాదన్‌కుర్తి తదితర గ్రామాల్లో పనులపై రాత్రివరకు సభ జరిగింది. ఎంపీపీ మోహిద్, వైస్ ఎంపీపీ వాల్‌సింగ్, ఎంపీడీవోలు మల్లేశ్,వనజ, ఎస్‌ఆర్‌పీలు మహేశ్, రాఘవ, సర్పంచ్‌లు, కార్యదర్శులు ఉన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతతోనే ఆరోగ్యం



విద్యార్థినులకు ఆరోగ్య కిట్లు అందజేస్తున్న మెడికల్ ఆఫీసర్

ఆదిలాబాద్‌టౌన్: వ్యక్తిగత పరిశుభ్రతతో ఆరోగ్యంగా ఉండవచ్చని ఆయుష్ మెడికల్ ఆఫీసర్ చంద్రశేఖర్ అన్నారు. సోమవారం ఆదిలాబాద్ పట్టణంలోని రూరల్ కేజీబీవీలో మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. అంతకు ముందు విద్యార్థినులకు ఆరోగ్య కిట్లు అందజేశారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ వినోద్ కుమార్, కేజీబీవీ ప్రత్యేకాధికారి జె.కవిత, టీచర్లు అర్చన, శిల్ప, జయలక్ష్మి, గోదావరి, పద్మ పాల్గొన్నారు.

ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రంలోని జెడ్పీఎస్‌ఎస్ బాలికల పాఠశాలలో ఆయూష్ కిట్లు సోమవారం పంపిణీ చేశారు. పదో తరగతికి చెందిన 16 మంది బాలికలకు న్యూట్రీషన్ కిట్లు అందచేశారు. ఎంపీపీఎస్ బాలికల పాఠశాల పిల్లలకు రాగి లడ్డులు పంపిణీ చేశారు. వైద్యాధికారి సమీన, వైద్య సిబ్బంది శాకీర్, శివరావు, కంటేశ్వర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

ఉట్నూర్‌రూరల్: పూర్వ విద్యార్థులు పాఠశాల అభివృద్ధికి వివిధ కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని ఎంఈవో శ్రీనివాస్ అన్నారు. సోమవారం ఉట్నూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2005– 06 బ్యాచ్‌కి చెందిన పూర్వ విద్యార్థులు పదో తరగతి విద్యార్థులకు పెన్నులు, ప్యాడ్లు అందించారు. ఎలాంటి భయాందోళన చెందకుండా పరీక్ష రాసి, ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ధరంసింగ్, నవీన్, చరణ్, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.